# ట్రంప్ విధానాలకు శాస్త్రవేత్తల నిరసన

**ట్రంప్** అమెరికా సామ్రాజ్యవాద అధినాయకుడిగా పగ్గాలు చేపట్టిన నాటినుండీ మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణం, మధ్య ఆసియాపై బాంబులు వేయటానికి సైనిక బడ్జెట్టు పెంపు ప్రాధాన్యతలయ్యాయి. దీనికోసం పాఠశాలలకూ, పర్యావరణ రక్షణకూ, వైద్యరంగ పరిశోధనలకూ ఇతర సంక్షేమ కార్యాలకూ నిధులను తగ్గించివేశాడు. దీనిని నిరసిస్తూ అమెరికా శాస్త్రవేత్తలు ఏప్రిల్ 22న (ఎర్త్ డే) అమెరికా అంతటా నిరసన ప్రదర్శనలు చేశారు. “ఉపాధికీ, విద్యకూ, వైద్యానికీ నిధులివ్వండి – సిరియాపై బాంబులు వేయటానికి కాదు” – అని నినదించారు. చికాగోలో వేలాదిమంది శాస్త్రవేత్తలూ, వారి సహాయకులూ వీధి ప్రదర్శనల్లో పాల్గొన్నారు. కొలంబస్, డెట్రాయిట్ వంటి నగరాల్లోనే కాక చిన్న పట్టణాలలో కూడా ప్రదర్శనలు జరిగాయి. వీరితోపాటు ఉపాధ్యాయులు, కార్మికులు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనలకు ముందుగా శాస్త్రవేత్తలు ప్రచారం సాగించారు. లాభార్జన ధ్యేయంగా పెట్టుబడిదారీ విధానం వల్ల భూగోళ వేడిమి ఎలా పెరిగిందో వివరించారు. ఔషధరంగం, వ్యవసాయ వాణిజ్యం, కార్ల తయారీ, సైనిక పరిశ్రమల లాభార్జన కోసమే శాస్త్ర పరిజ్ఞానాన్ని వినియోగించటం దిశగానే శాస్త్రవేత్తలతో పరిశోధనలు చేయిస్తున్నారని తెలిపారు. ఈ ప్రపంచంలో జీవనం మరింత సుఖవంతంగా ఉండేందుకు అవసరమైన శాస్త్రవేత్తల ముందుచూపును ద్రవ్యపెట్టుబడి లాభజూదం అణచివేస్తున్నదని వివరించారు.

ooooo